క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

నందలూరు(రాజంపేట) : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సౌభాగ్యమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని అధికారులు, మండల, జిల్లా ప్రాదేశిక సభ్యులు, సర్పంచ్‌లు వారి గుర్తింపు కార్డులు, ఆయా శాఖల నివేదికలతో తప్పక హాజరుకావాలని కోరారు.

ఆణిముత్యాలాంటి అక్షరాలతో మంచి మార్కులు

రాయచోటి టౌన్ : అక్షరాలు ఆణిముత్యాలాంటి అక్షరాలే మంచి మార్కులకు మార్గాలని డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ అజయ్‌కుమార్ బాబు అన్నారు. మంగళవారం డైట్ కేంద్రంలో త్వరలో జరగబోయే పబ్లిక్ పరీక్షలను దృష్టిలో ఉంచుకొని విద్యార్థులకు చేతిరాతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చేతిరాత స్పెషలిస్టు రెడ్డెన్న ద్వారా అవగాహన కల్పించారు. పరీక్షలలో అక్షరాలు ఆణిముత్యాల్లా కనిపిస్తే మంచి సమాధానాలు క్షుణ్ణంగా కనిపిస్తాయని దీంతో మంచి మార్కులు సాధించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

బహుమతుల ప్రదానం

లక్కిరెడ్డిపల్లె : సైన్స్ ద్వారా విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కోమటిరెడ్డి శివశంకర్ రెడ్డి పేర్కొన్నారు. గత ఏడాది డిసెంబర్‌లో నేషనల్ సైన్స్ ఒలంపియాడ్ పోటీ పరీక్షలు నిర్వహించారు. ఈ పోటీలలో ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు పాల్గొనగా 9 మంది ప్రతిభ కనబరిచారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గోల్డ్ మెడల్ ప్రశంసాపత్రాలు మంగళవారం ప్రిన్సిపాల్ శివశంకర్ రెడ్డి అందజేశారు. ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రంగోలి, పొంగల్ కార్యక్రమ విజేతలకు బహుమతులు అందించారు.

బాధ్యతల స్వీకరణ



రాజంపేట : రాజంపేట పురపాలక సంఘం కమిషనర్‌గా రాంబాబు మంగళవారం బాధ్యతలను తీసుకున్నారు. ఈయన చింతలపూడి పురపాలక సంఘం కమిషనరుగా పనిచేసిన ఆయన రాజంపేటకు బదిలీపై వచ్చారు. ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పట్టణవాసులకు మెరుగైన సేవలందించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. అనంతరం వివిధ విభాగాల అధికారులతో సమావేశమయ్యారు. అంతకముందుగా కమిషనర్ మర్యాదపూర్వకంగా మున్సిపాలిటి చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డిని కలిశారు.

రాజంపేట అర్బన్ ఎస్ఐగా వెంకటేశ్వర్లు

రాజంపేట అర్బన్ సీఐగా వెంకటేశ్వర్లు మంగళవారం బాధ్యతలు తీసుకున్నారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా రైల్వేకోడూరు నుంచి రాజంపేట అర్బన్ పీఎస్‌కు వచ్చారు. గతంలో ఓబులవారిపల్లె, రైల్వేకోడూరులో పనిచేశారు.

వైస్ ఎంపీపీకి పరామర్శ



జనార్దన్ రెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే దంపతులు

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట వైస్ ఎంపీపీ గడ్డం జనార్దన్ రెడ్డిని మంగళవారం ఎమ్మెల్యే మేడా వెంకట మల్లికార్జున రెడ్డి, ఆయన సతీమణి సుచరితలు పరామర్శించారు. హైదరాబాద్‌లోని యశోద హాస్పిటల్‌లో శస్త్ర చికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న ఆయన్ను ఎమ్మెల్యే మేడా పరామర్శించి ఆసుపత్రి యాజమాన్యంతో వైస్ ఎంపీపీ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

సత్కారం

నందలూరు(రాజంపేట) : విద్యార్థులు పోటీతత్వాన్ని అలవరుచుకోవాలని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి, ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డిలు పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించిన అఫ్రీన్, అర్షియా, తస్లీమ్‌లను గొబ్బిళ్ల అక్షర పాఠశాల యాజమాన్యం బుధవారం ఘనంగా సత్కరించింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన వారు మాట్లాడుతూ నేషనల్ స్టూడెంట్ ఇన్నోవేషన్ ఛాలెంజ్ (ఎన్ఎస్ఐసీ) పోటీలలో విద్యార్థులు గోల్డ్ మెడల్ సాధించి నందలూరు కీర్తి ప్రతిష్టలను పెంపొందించారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంఈఓ అనంత కృష్ణ, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యానాదయ్యకు సన్మానం

రాజంపేట : టీటీడీ బోర్డు డైరెక్టర్ యానాదయ్యకు సన్మానం చేశారు. మంగళవారం రాజంపేటకు వచ్చిన ఆయన్ను పలువురు శాలువా కప్పి సత్కరించారు. త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలలో భాగంగా ఆయన రాజంపేటకు విచ్చేశారు. ఆలయ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి సుబ్బరామయ్యల ఆధ్వర్యంలో త్యాగరాజస్వామి మూడవ ఆరాధన ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగానే స్వామివారి ఆరాధనకు యానాదయ్య హాజరయ్యారు.

డైరీ ఆవిష్కరణ

రాయచోటి టౌన్ : అన్నమయ్య జిల్లా డీఎం అండ్ హెచ్ఓ కొండయ్య చేతులమీదుగా ఎంపీహెచ్ఓ అండ్ సీహెచ్ఓ వారి నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు.

లబ్ధిదారులే వైఎస్సార్‌సీపీ 'స్టార్ క్యాంపెయినర్'లు

- తమది మహిళా పక్షపాత ప్రభుత్వం
- ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా రుణాలు మాఫీ చేశాం
- ప్రాణమున్నంత వరకూ వైఎస్ జగన్ వెంటే
- ఆసరా 4వ విడత సదస్సులో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి



మెగా చెక్కును మహిళలకు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



థాంక్యూ సీఎం సర్ ప్లకార్డులతో డ్వాక్రా మహిళలు

రాయచోటి అర్బన్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రభుత్వం మహిళా పక్షపాత ప్రభుత్వమని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో రాయచోటి మున్సిపాలిటీ, రూరల్ మండల పరిధిలో వైఎస్ఆర్ ఆసరా నాలుగవ విడత సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జగనన్న పాదయాత్రలో అక్క,చెల్లెమ్మలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నారన్నారు. ఎన్నికల సమయానికి ఉన్న డ్వాక్రా రుణాలను నాలుగు విడతలలో మాఫీ చేసి హామీని నెరవేర్చారన్నారు. రాయచోటి మున్సిపాలిటీలో నాలుగవ విడత కింద 745 సంఘాలకు రూ.5.34 కోట్లు, రూరల్ మండలంలోని 424 సంఘాలకు రూ. 3.14 కోట్లకు పైగా లబ్ధి చేకూరిందన్నారు. జగనన్న పాలనలో అర్హతే ఆధారంగా సంక్షేమ పథకాల లబ్ధి పొందారని తెలియజేశారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.2.50లక్షల కోట్లను వివిధ సంక్షేమ పథకాల ద్వారా నేరుగా మహిళలకే ప్రభుత్వం అందించిందన్నారు. పట్టణ పేదల కోసం నారాయణరెడ్డిపల్లె వద్ద 6వేల ఇళ్లతో జగనన్న కాలనీ నిర్మితమవుతుందన్నారు.

ప్రాణమున్నంత వరకు వైఎస్ జగన్ వెంటే..

నా ప్రాణమున్నంత వరకు వైఎస్ జగన్ వెంటే ఉంటానంటూ శ్రీకాంత్‌రెడ్డి స్పష్టం చేశారు. తాను వైఎస్సార్‌సీపీ వీడుతున్నానంటూ కొందరూ చేస్తున్న అసత్య ప్రచారాలను ఖండించారు. సీఎంతో తనకు ఉన్న సన్నిహిత సంబంధాలను జీర్ణించుకోలేక ఇలాంటి దిగజారుడు ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు. కుట్రలు, కుతంత్రాలు తన ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీయలేవని, రాయచోటి ప్రజలకు సేవ చేసి వారి రుణం తీర్చుకుంటానని తెలియజేశారు. రాష్ట్రంలో జననేతకు ఉన్న ప్రజాదరణను చూసి టీడీపీ నేతలు కొత్తతరహా కుట్రలు, కుతంత్రాలకు తెరతీశారన్నారు. తన గొంతులో ఊపిరి ఉన్నంత వరకు జిల్లా కేంద్రం తరలించడం ఎవరి తరం కాదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుకున్న లబ్ధి పొందిన అక్కచెల్లెమ్మలే రాబోయే ఎన్నికల్లో తమ పార్టీ స్టార్ క్యాంపెయినర్‌లని శ్రీకాంత్‌రెడ్డి చెప్పుకొచ్చారు. సంక్షేమ సారథిని ఎదుర్కొనే దమ్ముధైర్యం చంద్రబాబుకు లేక పొత్తుల కోసం పాకులాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఎంతమంది కూడబలుక్కొని వచ్చిన వైఎస్సార్‌సీపీ గెలుపును ఎవరూ ఆపలేరని చెప్పారు. నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ప్రశాంతతకు నిలయంగా రాయచోటి

ఒకప్పుడు ఎన్నికలంటే రాయచోటిలో గొడవలు, ఘర్షణలు, బాంబులు వేసుకోవడం జరుగుతుండేదన్నారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక రౌడీయిజం, గూండాయిజం, భూ కబ్జాలు, సివిల్ పంచాయతీ సెటిల్‌మెంట్లను రూపుమాపి ప్రశాంత వాతావరణం నెలకొల్పామన్నారు. సీఎం జగన్ ప్రభుత్వంపై తోడేళ్లు, గుంటనక్కలు, దుష్టచతుష్టయం చేస్తున్న దుష్ప్రచారాలను ప్రజలే తిప్పికొట్టాలంటూ పిలుపునిచ్చారు. అనంతరం మహిళలకు వైఎస్సార్ ఆసరా మెగా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్‌లు తబ్రేజ్‌ఖాన్, మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్ బాషా, వైస్ చైర్మన్ ఫయాజుర్‌రహిమాన్, జెడ్పీటీసీ వెంకటేశ్వర్‌రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నేతలు శ్రీనివాసులురెడ్డి, పోలు సుబ్బారెడ్డి, మహమ్మద్‌ఖాన్, బీసీ నేత పల్లపు రమేష్, ఈశ్వర్‌ప్రసాద్, అల్తాఫ్, గౌస్‌ఖాన్, కొలిమి చాన్‌బాషా, జి.మహమ్మద్ ఇర్షాద్, సయ్యద్ షబ్బీర్, ఇర్ఫాన్, రామచంద్రారెడ్డి, జానం రవీంద్రయాదవ్, ఆసిఫ్‌అలీఖాన్, దేవా విక్కీ, మౌలా, మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్, పట్టణ మెప్మా అధికారి అబ్బాస్‌అలీలు పాల్గొన్నారు.

ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

సంబేపల్లె/లక్కిరెడ్డిపల్లె : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ఆయా మండలాల గురుకులం పాఠశాలల ప్రిన్సిపాల్స్ జి.శ్రీకళ దేవి, విజయ తెలిపారు. ఆయా గురుకుల పాఠశాలలో ఆంగ్ల మాధ్యమంలో ఐదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం (ఎంపీసీ, బైపీసీ) 2024 - 25 సంవత్సరంలో ప్రవేశానికి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రవేశ పరీక్ష మార్చి 10వ తేదీన జరగనుందని, ఐదవ తరగతిలో ఈ విద్యా సంవత్సరంలో నాల్గవ తరగతి చదువుతున్న వారు అర్హులని, అలాగే ఇంటర్మీడియట్ ప్రవేశానికి ఈ విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదువుతున్న వారు అర్హులని తెలిపారు. ఈనెల 25వ తేదీ నుంచి ఫిబ్రవరి 23వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9603203922 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

సేవా కార్యక్రమాలపై సమీక్ష

చిట్వేలి : మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చిట్వేలి శాఖ ఆధ్వర్యంలో జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక శ్రీ సాయి వికాస్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మానవత నెలవారీ సమావేశం నిర్వహించారు. సంస్థ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలపై సమీక్ష చేశారు. శాంతిరథం కోసం నిధుల సేకరణపై చర్చించారు. కార్యక్రమంలో మండలంలోని మానవత సభ్యులు, మానవత బాధ్యులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమం పూర్తిగా అందించేందుకే కులగణన



కులగణన సర్వేని తనిఖీ చేస్తున్న ఆర్డీఓ రామకృష్ణారెడ్డి

రాజంపేట టౌన్ : కులగణన వల్ల వివిధ కులాల వారికి సంక్షేమ పథకాలు సులువుగా అందించేందుకు వీలవుతుందని ఆర్డీఓ రామకృష్ణారెడ్డి తెలిపారు. కులగణన సర్వే ప్రక్రియను మంగళవారం ఆర్డీఓ స్వయంగా తనిఖీ చేశారు. అందులో భాగంగా వలంటీర్లు సర్వే సందర్భంగా పొందుపరచిన పేర్లు, వారి కులం, ఆర్థిక స్థితిగతుల వివరాలను ప్రజలను అడిగి తెలుసుకొని సరిపోలినవా లేదా అని ఆన్‌లైన్‌లో పరిశీలించారు. కొన్ని ఉపకులాల వారు ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో అందుకోలేకపోతున్నారని అలాంటి వారికి కులగణన ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ సర్వే వల్ల ఆర్థికంగా వెనకబడిన వారిని వివరాలు తెలుసుకునేందుకు వీలవుతుందన్నారు. అందువల్ల పేదలకు అందే అన్ని సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు. డివిజన్‌లో 80 శాతానికి పైగా సర్వే పూర్తయిందన్నారు. సత్వరమే వందశాతం సర్వే పూర్తయ్యేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ ఎం.నరసింహమూర్తి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో నిరసన

సిద్దవటం : మండలంలోని ముమ్మడిగుంటపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీ మహిళలు తాగునీటి కోసం గ్రామంలో మంగళవారం ఖాళీ బిందెలతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు మాట్లాడుతూ మా కాలనీలో దాదాపు రెండు నెలలుగా మాకు తాగునీరు అందలేదన్నారు. మోటార్లు చెడిపోయిన ఇప్పటివరకు మరమ్మతులు చేయించలేదన్నారు. ఈ విషయమై ఎంపీడీఓ జవహర్‌బాబును వివరణ కోరగా ముమ్మడిగుంటపల్లి ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య ఉన్నట్లు తమ దృష్టికి ఇప్పుడే వచ్చిందని, రెండు రోజుల్లో గ్రామస్తులకు తాగునీరు అందిస్తామని ఆయన చెప్పారు.

ప్రజల ముంగిటకే వైద్య సేవలు

సిద్దవటం : ప్రజల ముంగిటకే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య సేవలను నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ జవహర్‌బాబు తెలిపారు. సిద్దవటం మండలంలోని మాధవరం - 2 గ్రామ సచివాలయంలో మంగళవారం రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్షా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ఎ.ఉమామహేశ్వర్‌కుమార్ తనిఖీ చేశారన్నారు. సురక్షా క్యాంపులో ప్రజలు విరివిగా పాల్గొని వైద్య సేవలను పొందారన్నారు. వైద్య నిపుణులైన పీడియాట్రిక్ డాక్టర్ అబ్దుల్ రెహమాన్, ఈఎన్‌టీ డాక్టర్ శైనీ షారోన్, జనరల్ వైద్యులు డాక్టర్ శివకుమార్, డాక్టర్ శ్రీవిద్య, ఆప్తాల్మిక్ లక్ష్మీకర్‌లు వైద్యులు, వారి సిబ్బంది అన్నీ రకాల పరీక్షలు, చికిత్సలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ పులిరామ్‌సింగ్, సర్పంచ్ జానకిరామయ్య, ఉప సర్పంచ్ తాతిరెడ్డి సుబ్బారెడ్డి, ఎంపీటీసీ శివయ్య, వైఎస్ఆర్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి వావిళ్ల శ్రీనివాసులరెడ్డి, సచివాలయ జేసీఎస్ కన్వీనర్ శ్రీరామదాసు వెంకట్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీవిద్య, గ్రామ కార్యదర్శులు లక్ష్మీనరసయ్య, సుజాత, వీఆర్వోలు రజని, గౌస్ బాషా, సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో నీటి సమస్య తలెత్తకూడదు

మండలస్థాయి అధికారులకు ఎంపీపీ సుధామాధురి సూచన



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుధామాధురి

చిన్నమండెం : ఆశించిన రీతిలో వర్షపాతం నమోదు కాకపోవడంతో వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని మండల పరిషత్ అధ్యక్షురాలు సుధామాధురి తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ అదే విధంగా ఇప్పటికే ఎండలు మండుతున్నాయని ప్రజలకు, మరీ ముఖ్యంగా చిన్న పిల్లలకు వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకునేలా వైద్య సిబ్బంది చొరవ చూపాలన్నారు. వరి, వేరుశనగ పంటలు సాగు చేసిన రైతులు ఈ క్రాప్ చేసుకునేలా వ్యవసాయాధికారులు రైతులను సన్నద్ధం చేయాలన్నారు. జగనన్న హౌసింగ్ పథకంలో మండల వ్యాప్తంగా మంజూరైన 1180 ఇళ్లలో 770 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. జరగబోవు పబ్లిక్ పరీక్షలపై విద్యాశాఖాధికారులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఉపాధి కూలీలకు పనులు చూపించేలా అధికారులు సమాయత్తం కావాలన్నారు. అనంతరం మండల స్థాయి అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ పవన్‌కుమార్, మండల ఉపాధ్యక్షుడు ఏజాజ్ అలీఖాన్, కో-ఆప్షన్ మెంబర్ గౌస్‌సాబ్, ఎంపీటీసీలు రమేష్, వెంకటప్పనాయుడు, శ్రీరాములు, రమణ, శ్యామ్, సర్పంచులు ముసల్‌రెడ్డి, లోకేశ్వరరెడ్డి, లక్ష్మీరెడ్డి, నజీర్‌బాషా, దామోదర్, క్రిష్ణమ్మ, జయమ్మ, ఉపసర్పంచ్ సుదర్శన్‌బాబు, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

రాయచోటి : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని జిల్లా జేసీఎస్ కో-ఆర్డినేటర్ రావుల నరసింహారెడ్డికి పార్టీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి సూచించారు. మంగళవారం రాయచోటిలోని పార్టీ కార్యాలయంలో శ్రీకాంత్‌రెడ్డిని నరసింహారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జేసీఎస్ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను ఎమ్మెల్యేకు వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు అందుకున్న ప్రజలు జగనన్న ప్రభుత్వంపై నమ్మకంతో మరోసారి పార్టీని గెలిపించాలన్న కసితో ఉన్నారన్నారు. కార్యక్రమంలో తిరుపతి జేసీఎస్ కో-ఆర్డినేటర్ బి.నారాయణ రెడ్డి, పీలేరు వైఎస్సార్‌సీపీ పట్టణ యువజన నాయకుడు ద్వారకానాథ రెడ్డిలు పాల్గొన్నారు.

రాజంపేట కమిషనర్‌కు వీడ్కోలు సభ



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి

రాజంపేట : మున్సిపల్ కమిషనర్ జనార్దన్‌రెడ్డి బదిలీ అయ్యారు. మంగళవారం రాజంపేట బైపాస్ రహదారిలోని కళాంజలి గార్డెన్స్‌లో బదిలీపై వెళుతున్న కమిషనర్‌కు అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆకేపాటి మాట్లాడుతూ వివాద రహితుడిగా, సౌమ్యుడిగా ఉంటూ పట్టణ అభివృద్ధికి కమిషనర్ చేసిన కృషి అభినందనీయమన్నారు. మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ కమిషనరు జనార్దనరెడ్డి సేవలు ప్రశంసనీయమన్నారు. అనంతరం రాజంపేట ఆర్డీఓ రామకృష్ణారెడ్డి, ప్రస్తుత కమిషనర్ రాంబాబు, పోలా రమణారెడ్డి, వైస్ చైర్మన్ మర్రి రవి, సుమియా, పోలి మురళీరెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దండుగోపి, మీసాల వెంకటసుబ్బయ్య, కౌన్సిలర్లు, అధికారులు, సచివాలయ అధికారులు పాల్గొని ప్రసంగించారు. అనంతరం కమిషనరు జనార్దన్‌రెడ్డి శాలువా కప్పి, జ్ఞాపికలను అందజేసి సన్మానించారు.

సేవా దృక్పథంతో ముందుకు సాగాలి

నందలూరు(రాజంపేట) : ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సామాజిక సేవా దృక్పథంతో ముందుకు సాగాలని జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ప్రోగ్రాం అధికారి పెద్దిరెడ్డి నీలవేణి ఆధ్వర్యంలో అరవపల్లె జిల్లా పరిషత్ క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాన్ని ఆకేపాటి సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ క్రమ శిక్షణకు మారుపేరని, మంచి ఆలోచనలతోపాటు కష్టపడే మనస్తత్వం, నిరంతర సేవా దృక్పథం లాంటి మంచి అలవాట్లు అలవరుచుకొని సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడేలా భావి భారత పౌరులుగా తయారు కావాలని సూచించారు. ప్రత్యేక శిబిరంలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపులో డాక్టర్ కార్తిక్, డాక్టర్ తారక్ సాయి పాల్గొని స్థానిక ప్రజలకు, విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధికి వృత్తి విద్య దోహదం

రామాపురం : జీవితంలో ఉపాధి కల్పనకు వృత్తి విద్య దోహదపడుతోందని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్‌కేఎండీ అఫ్రోజ్ బేగం అన్నారు. మండల పరిధిలోని ఆదర్శ పాఠశాలలో మంగళవారం 8, 9, 10, ఇంటర్ విద్యార్థులకు బ్యూటీ అండ్ వెల్‌నెస్ శిక్షణలో భాగంగా లక్కిరెడ్డిపల్లె వసూల్ బ్యూటీ కేంద్రంలో క్షేత్రస్థాయి శిక్షణపై అవగాహన కల్పించారు. బ్యూటీకి సంబంధించిన పరికరాలను ఏ విధంగా ఉపయోగించాలో వృత్తి విద్య ఉపాధ్యాయురాలు సురేఖా బాలికలకు అవగాహన కల్పించారు. మెహందీ, ఫేస్‌వాష్, మేకప్ ఎలా చేయాలి అనేది చేసి చూపించారు.

టీచర్ల ఆర్థిక సమస్యలు పరిష్కరించండి

రాయచోటి అర్బన్ : ఉపాధ్యాయుల ఆర్థిక, విద్యా సంబంధ, దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) ఉపాధ్యాయులు డీఆర్‌ఓ సత్యనారాయణ, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిలకు వేర్వేరుగా వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా బీటీఏ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పల్లం రామచంద్ర మాట్లాడుతూ ప్రభుత్వం పీఎఫ్ లోన్‌లను, సంపాదిత సెలవుల నగదును కొంతమందికి మాత్రమే మంజూరుచేసి మిగిలిన వారికి పట్టించుకోలేదన్నారు. గత ఏపీజీఎల్ఐ సర్వీసులను నిలుపుదల చేశారని, రూ. 330 కోట్ల ఏపీజీఎల్ఐ లోన్‌లను త్వరగా మంజూరు చేయాలని కోరారు. ఏప్రిల్ మాసం నుంచి పెండింగ్‌లో ఉన్న వెయ్యికోట్లకు పైగా పీఎఫ్ లోన్ల ఫైనల్ పేమెంట్‌లను వెంటనే మంజూరు చేయాలంటూ డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 4వతేదీలోపు తమ డిమాండ్లను పరిష్కరించని పక్షంలో ఫిబ్రవరి 5న విజయవాడ ధర్నా చౌక్‌లో ధర్నా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో రవిశంకర్, అబ్దుల్‌రజాక్, ఎం.హబీబుల్లాఖాన్, రవిశంకర్, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

'రాజకీయ లబ్ధి కోసమే బీజేపీ మత రాజకీయాలు'

రాయచోటి అర్బన్ : దేశంలో కుల, మతాలను అడ్డు పెట్టుకుని రాజకీయ లబ్ధి పొందేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వెంపర్లాడుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య విమర్శించారు. మంగళవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన ఆపార్టీ జిల్లాకార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ట పేరుతో రానున్న ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందేందుకు బీజేపీ ప్రయత్నిస్తుండడం దారుణమన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి అందాల్సిన నిధులు, విభజన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తున్న ఆపార్టీతో టిడిపి, జనసేనలు అంటకాగుతుండడం దారుణమన్నారు. రాజ్యాంగ బద్ధంగా నడవాల్సిన వ్యవస్థలను వాడుకుని విపక్షాలను లొంగదీసుకునేందుకు బీజేపీ ప్రభుత్వం తీవ్రస్థాయిలో ప్రయత్నిస్తోందంటూ ఆరోపించారు. కలెక్టర్ గిరీషా హయాంలో జరిగిన భూ కేటాయింపులపై సమగ్ర విచారణ జరిపి ప్రభుత్వ భూములను కాపాడాలంటూ కోరారు.

అక్కచెల్లెమ్మలకు ఆర్థిక భరోసా వైఎస్సార్ ఆసరా

వైఎస్సార్ ఆసరా సంబరాల్లో ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు, కొల్లం గంగిరెడ్డిలు



పుల్లంపేట: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొరముట్ల

పుల్లంపేట : స్వయం సహాయక సంఘాల అక్కా చెల్లెమ్మలకు ఆర్థిక భరోసా కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని రైల్వేకోడూరు శాసనసభ్యులు కొరముట్ల శ్రీనివాసులు, నియోజకవర్గ సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డిలు పేర్కొన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో వైఎస్సార్ ఆసరా నాల్గో విడత సంబరాలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వవిప్ కొరముట్ల మాట్లాడుతూ పాదయాత్ర ఇచ్చిన హామీ ప్రకారం డ్వాక్రా రుణాలను నాలుగు విడతల్లో మాఫీ చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. పుల్లంపేటలో నాల్గవ విడత రూ. 4.18 కోట్లు 4180 మంది డ్వాక్రా మహిళల ఖాతాలలో జమ చేయనున్నారన్నారు. ప్రతి మహిళ ఆర్థికాభివృద్ధి సాధించాలన్నదే సీఎం జగన్ ధ్యేయమని ఆ దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అనంతరం వైఎస్సార్ ఆసరా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. తదుపరి సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ 2024 ఎన్నికలలో ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, రైల్వేకోడూరు శాసనసభ్యులు కొరముట్ల శ్రీనివాసులకు అక్కా చెల్లెమ్మలు ఓట్లువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గీతా రామనాథం, జేసీఎస్ మండల కన్వీనర్ హరినాథ్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కుమార్ రెడ్డి, మల్లికార్జున రెడ్డి, నలిని, బికె మణి, సుదర్శన్ రెడ్డి, ఎం.శంకర్ రెడ్డి, తహసీల్దార్ నరసింహకుమార్, ఎంపీడీఓ రఘురాం, వెలుగు ఏరియా కో-ఆర్డినేటర్ నిరంజన్, ఏపీఎం వెంకటసుబ్బమ్మ, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వరం సీఎంఆర్ఎఫ్

రైల్వేకోడూరు అర్బన్ : ముఖ్యమంత్రి సహాయనిధి పేద ప్రజలకు వరం లాంటిదని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి సహకారంతో నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాలకు చెందిన 13 మందికి మంజూరైన రూ. 10 లక్షలు విలువ చేసే సీఎంఆర్ఎఫ్ చెక్కులను పేదలకు అందించారు.

దశాబ్దాల కల నెరవేరుతున్న వేళ

దశాబ్దాలుగా నెలకొని ఉన్న గుంజనేరు ప్రొటెక్షన్ వాల్ నిర్మాణానికి రూ. 40 కోట్లు మంజూరయ్యాయని, నేడు భూమిపూజ చేస్తున్నట్లు ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు తెలిపారు. ఆయన గుంజన ప్రొటెక్షన్ వాల్ నిర్మిత గుంజనేరు పరీవాహక ప్రాంతాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వవిప్ మాట్లాడుతూ నరసరాంపేట, గాండ్లవీధి, వెంకయ్యస్వామి గుడి, ధర్మాపురం తదితర ప్రాంతాలు ప్రొటెక్షన్ వాల్ లేక నీట మునుగుతున్నాయని, ఇందుకోసం ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిధులు మంజూరు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. పనులు నేటి నుంచి ప్రారంభం అవుతాయని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి, కాంట్రాక్టర్ శ్రీనివాసులు రెడ్డి, ఉప సర్పంచ్ తోట శివసాయి తదితరులు పాల్గొన్నారు.

శాంతి, అహింసలే సమాజహిత కారకాలు



గాంధీ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న ఆకేపాటి

రాజంపేట టౌన్ : జాతిపిత మహాత్మా గాంధీ అనుసరించిన సత్యం, శాంతి, అహింసలే సమాజహిత కారకాలని, మహాత్ముడు చూపిన మార్గం అందరికి అనుసరణీయం కావాలని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు ననిశెట్టి నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక గాంధీ సర్కిల్‌లో నిర్వహించిన గాంధీ వర్ధంతి కార్యక్రమానికి ఆకేపాటి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆకేపాటి విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

సిద్దవటం : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జాతిపిత మహాత్మా గాంధీ 76వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీరాములు, ఉపాధ్యాయులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు శ్రీరాములు మాట్లాడుతూ అహింసా వాదంతో ఎంతటి కఠిన లక్ష్యాన్ని అయినా ఛేదించవచ్చునని జాతిపిత నిరూపించారన్నారు. కార్యక్రమంలో మునిస్వామి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు : మండలంలోని బాలపల్లి పంచాయతీ, జ్యోతి కాలనీలో మంగళవారం మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని స్పర్శ ఆధ్వర్యంలో లెప్రసీ వ్యాధిపట్ల స్థానికులకు అవగాహన కల్పించారు. అలాగే 39 మందికి ఎంసీఆర్ చెప్పులు అందించి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి శైలజ, సందీప్, మెడికల్ ఆఫీసర్ రవికుమార్, వైద్యులు గుర్రప్ప, శంభు ప్రసాద్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె : జాతిపిత మహాత్మా గాంధీ 76వ వర్ధంతిని మంగళవారం మండల కేంద్రంలోని శ్రీ రిషీ అప్పర్ ప్రైమరీ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

• క్లుప్తంగా

మెప్మా భవన నిర్మాణానికి నిధులు

రాజంపేట : పురపాలక సంఘం క్యాంపస్‌లో రూ.10 లక్షలతో మెప్మా మహిళల కోసం స్వంత భవనం నిర్మిస్తున్నట్లు రాజంపేట పురపాలక సంఘం చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి తెలిపారు. మంగళవారం పురపాలక సంఘం పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించారు. అనంతరం మహిళలు పోలా శ్రీనివాస్‌రెడ్డిని సన్మానించారు.

ఘనంగా త్యాగరాజస్వామి ఆరాధన

చిట్వేలి : నాయీ బ్రాహ్మణ సేవాసంఘం ఆధ్వర్యంలో మంగళవారం ప్రముఖ వాగ్గేయకారుడు త్యాగరాజు స్వామి ఆరాధన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నాయీ బ్రాహ్మణ యువత ఆధ్వర్యంలో స్థానిక శివాలయం నుంచి మేళతాళాలు, బాణసంచా పేలుళ్ల మధ్య త్యాగరాజుస్వామి చిత్రపటాన్ని ఊరేగించారు.

వైద్య శిబిరానికి స్పందన

ఓబులవారిపల్లె : మంగంపేట ఏపీఎండీసీ ఆరోగ్య కేంద్రంలో ఆధ్యా మెడికల్ సర్వీసస్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత మెడికల్ క్యాంపునకు విశేష స్పందన లభించింది. తిరుపతికి చెందిన ప్రైవేటు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు రోగులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

పగడిపూట బల్బులు ఆఫ్ చేయాలి

పెనగలూరు (ఓబులవారిపల్లె) : పగటిపూట వీధులలో విద్యుత్ బల్బులను ఆఫ్ చేయాలని విద్యుత్ ఏఈ షఫీ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో విద్యుత్ వృథా అవుతోందన్నారు. స్విచ్‌లను ఆఫ్ చేయాలన్నారు. ఉదయం బల్బులు ఆఫ్ చేసి సిబ్బంది సహకరించాలని కోరారు.

పరామర్శ

రాజంపేట : రాజంపేట వై జంక్షన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన రమణయ్య ఆచారి, బ్రహ్మయ్య ఆచారి కుటుంబాలను జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి పరామర్శించారు.